నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్-నిర్మల్

5 | నిజామాబాద్ బుధవారం 10 జూలై 2024 | ADILABAD NIRMAL




పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని నిర్మల్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు (ఫైల్)

# ప్రాథమిక విద్యపై భస్మాసుర హస్తం

**బిల్లులియ్యరూ.. బ్రేక్‌ఫాస్ట్ పెట్టరూ..**

## పాఠశాల నిర్వహణను గాలికొదిలేసిన కాంగ్రెస్ సర్కారు

- సమస్యల సుడిగుండంలో విద్యార్థులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు
- మౌలిక వసతులు కల్పించకుండా.. వాస్తవాలను వక్రీకరిస్తున్న రేవంత్ ప్రభుత్వం
- మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన ఆరోపణలన్నీ వాస్తవాలే..
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 'నమస్తే' క్షేత్రస్థాయి పరిశీలన




**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా** ప్రాథమిక విద్య నిర్లక్ష్యానికి గురవుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాల నిర్వహణను గాలికొదిలేయడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందక ఆకలితో అలమటిస్తున్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన చెందుతున్నారు. కుక్ అండ్ హెల్పర్లకు, సర్వశిక్ష అభియాన్ సిబ్బందికి వేతనాలు రాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. కోడిగుడ్ల బిల్లులు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉండడంతో ఇబ్బందిగా మారింది. పారిశుధ్య నిర్వహణకు నెలకు రూ.10 వేలు ఇస్తానన్న కాంగ్రెస్ సర్కారు మాట తప్పింది. ఉచిత కరెంటు ఇస్తామన్న హామీ కూడా ఉత్తదిగానే మారింది. సీఎం బ్రేక్‌ఫాస్ట్ అమలు కాకపోవడంతో విద్యార్థులు పస్తులు ఉంటున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రీమెట్రిక్ స్కాలర్ షిప్స్ రాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎదురవుతున్న సమస్యలపై మాజీ మంత్రి హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన సమస్యలపై 'నమస్తే తెలంగాణ' మంగళవారం బడులను సందర్శించింది. హరీశ్‌రావు లేవనెత్తిన సమస్యలు క్షేత్రస్థాయిలో కనిపించాయి. సమస్యలే లేవని ప్రకటించడంపై విద్యార్థులు, మధ్యాహ్న భోజన కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.

- నిర్మల్, జూలై 9(నమస్తే తెలంగాణ)



### అప్పులు చేసి అన్నం పెడుతున్న..

మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బిల్లులు సక్రమంగా రావడం లేదు. తెలిసిన వారి దగ్గర అప్పులు చేసి పిల్లలకు అన్నం పెడుతున్న. ఒక్క బియ్యం మాత్రమే ఇస్తున్నరు. ఉప్పు, పప్పులు, కూరగాయలు, కోడిగుడ్లు, నూనె ఇలా వంటకు అవసరమైన అన్ని సామాన్లు బయట నుంచి కొనితెస్తున్న. ఇక్కడి బడిలో 200 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నరు. వారంలో మూడు సార్లు కోడిగుడ్డుతో భోజనం పెట్టాలి. ప్రభుత్వం నుంచి నెలల తరబడి బిల్లులు రావడం లేదు. పిల్లలకు భోజనం పెట్టాలంటే చాలా కష్టమవుతున్నది. నాతోపాటు హెల్పర్ సింధూజ కూడా ఇక్కడే పని చేస్తున్నది. ఆమెకు ఐదు నెలల నుంచి పైసలు రాలే. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు స్కూల్‌లో ఊడ్చినందుకు నెలకు రూ.4 వేలు పంచాయతీ నుంచి వచ్చేటివి. ఇప్పుడు అవి కూడా బంద్ చేసిన్రు. ఎప్పటికప్పుడు బిల్లులు ఇచ్చి మాలాంటి పేదోళ్లను ప్రభుత్వం ఆదుకోవాలి.

**- మనోల్ల గంగామణి, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు, దేగాం.**

### బిల్లులు, వేతనాలు చెల్లించాలి..



నిర్మల్ చైన్‌గేట్, జూలై 9 : సకాలంలో మధ్యాహ్న భోజన బిల్లులు రాకపోవడంతో విద్యార్థులకు అప్పులు చేసి వండి పెడుతున్నం. కూరగాయలు, కోడిగుడ్ల ధరలు కూడా బాగా పెరిగాయి. ధరలకు అనుగుణంగా వేతనాలు చెల్లించాలి. మధ్యాహ్న భోజనం కార్మికులకు కూడా వేతనాలు చెల్లించాలని ఇటీవల పాఠశాల ప్రారంభం ముందు రోజు జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి పత్రం ఇచ్చాం. విద్యా సంవత్సరం ప్రారంభమైనా వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించాలి.

**- బట్టు విమల, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు.**



మామడలో మధ్యాహ్నభోజనం వంట చేస్తున్న నిర్వాహకులు

### బిల్లులు ఇయ్యరూ.. వేతనాలు వేయరూ..

నిర్మల్ జిల్లాలో 735 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, వీటిలో 533 ప్రాథమిక, 85 ప్రాథమికోన్నత, 117 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఆయా స్కూళ్లలో 45,875 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి రోజు మధ్యాహ్న భోజనాన్ని అందించేందుకు 735 మంది కార్మికులు, మరో 735 మంది హెల్పర్లు పని చేస్తున్నారు. అయితే వీరికి ఆరు నెలలుగా జీతాలతోపాటు, బిల్లులు సక్రమంగా రాకపోవడంతో మధ్యాహ్న భోజన నిర్వహణకు అప్పులు చేయాల్సి వస్తున్నది. వంటమనిషితోపాటు హెల్పర్లకు చెల్లించే గౌరవ వేతనం గతేడాది చివరి వరకే వచ్చినట్లు చెబుతున్నారు. మధ్యాహ్న భోజన బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో నాణ్యత లోపిస్తున్నదంటున్నారు. అలాగే కోడిగుడ్లకు సంబంధించిన బిల్లులు నాలుగు నెలలుగా రాకపోవడంతో నిర్వాహకులకు అప్పులు పెరిగిపోతున్నాయి.

### అస్తవ్యస్తంగా పారిశుధ్య నిర్వహణ

పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందంటున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ గ్రామ పంచాయతీల ద్వారా జరిగేది. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ బాధ్యతలను అమ్మ కమిటీలకు అప్పగిస్తామని చెప్పి పట్టించుకోకపోవడంతో పారిశుధ్య నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. శుభ్రం చేసేవారు లేకు టాయిలెట్లు కంపుకొడుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అర్ధాంతరంగా నిలిపివేయడంతో పేద విద్యార్థులు ఉదయం పూట పాఠశాలకు వచ్చి ఖాళీ కడుపులతోనే మధ్యాహ్నం వరకు వేచి ఉండాల్సిన పరిస్థితులు దాపురించాయి. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత కరెంటు అందిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పడంతో విద్యార్థులకు కరెంటు కష్టాలు తప్పడం లేదు. అనేక పాఠశాలల్లో కరెంటు బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో విద్యుత్ శాఖ అధికారులు కరెంటు కనెక్షన్లను తొలగిస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి. మంగళవారం మధ్యాహ్నం నిర్మల్ శివారులోని మంజులాపూర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించగా ఉదయం నుంచి కరెంటు లేదని విద్యార్థులు తెలిపారు. అలాగే సోమవారం కూడా రోజంతా కరెంటు కట్ చేశారని వాపోయారు. ఇలా కరెంటు విషయంలో అధికారులకే స్పష్టత లేకుండాపోయింది.

### విద్యావలంటీర్లను నియమించాలి..

ఇటీవల జరిగిన పదోన్నతుల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందడంతో ప్రాథమిక పాఠశాలల్లో వందలాదిగా ఖాళీలు ఏర్పడ్డాయి. ఈ విషయంలో పాలకులు, ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో చాలా చోట్ల పాఠశాలలు మూతబడే ప్రమాదమున్నదంటున్నారు. వెంటనే విద్యావలంటీర్లను నియమించాల్సిన అవసరం ఉంది. గతేడాదికి సంబంధించిన ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ, ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్స్ పెండింగ్‌లో ఉండడంతో విద్యార్థులు వాటి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకున్నది. సర్వశిక్షా అభియాన్, ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ (ఐఈఆర్‌పీ)ల వేతనాలు రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. పాఠశాలల్లో ప్రతిరోజు విద్యార్థులు, ఉపాధ్యాయులు సమస్యలతో సహవాసం చేస్తున్నప్పటికీ అసలు సమస్యలే లేవన్నట్లుగా విద్యాశాఖ ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందంటున్నారు. ప్రాథమిక విద్యను పటిష్టం చేయడానికి ప్రతి పాఠశాలకు వెంటనే రూ.10 వేలను విడుదల చేసి, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు.

### పారిశుధ్య నిర్వహణలేక అవస్థలు పడుతున్నం



ఉట్నూర్ రూరల్, జూలై 9 : పాఠశాలలో పారిశుధ్య కార్మికులు లేక ఇబ్బంది కలుగుతున్నది. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికులతో చేయించింది. ప్రస్తుతం గ్రామ పంచాయతీ సిబ్బంది రావడం లేదు. అమ్మ కమిటీలు ఏర్పాటు చేసిన వారు పనిచేయడం లేదు. పారిశుధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. అదేవిధంగా పాఠశాలకు ఉచిత కరెంటు ఇవ్వాలి. పాఠశాల నిర్వహణకు వచ్చిన డబ్బులతో ఇప్పటికే రూ.12వేల కరెంటు బిల్లు కట్టినం. మరో రూ.14 వేల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

**- ఆశన్న, హెచ్‌ఎం, ఉన్నత పాఠశాల, లక్కారం.**

### పెద్ద సార్లు అల్పాహారం పెట్టద్దన్నరు..



గతేడాది అక్టోబర్ నుంచి ఇక్కడి పాఠశాల విద్యార్థులకు రోజు ఉదయం అల్పాహారాన్ని పెట్టిన. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఒక నెల బిల్లులు వచ్చాయి. ఆ తర్వాత ఎలక్షన్లు అచ్చినయ్. ప్రభుత్వం మారింది. ఐదు నెలలుగా ఒక్క రూపాయి కూడా రాలేదు. తెలిసిన వారి దగ్గర బాకీ చేసి అల్పాహారానికి అవసరమైన సరుకులు కొని తీసుకొచ్చిన. రోజు 50 నుంచి 60 మంది విద్యార్థులకు అల్పాహారాన్ని పెట్టిన. దాదాపు రూ.80 వేల వరకు ప్రభుత్వం నుంచి బిల్లులు రావాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అచ్చిన తర్వాత కూడా ఈ పథకాన్ని అలాగే ఉంచుతారని అనుకుని అప్పులు చేసి పిల్లలకు రోజు ఉదయం మెనూ ప్రకారం అల్పాహారం పెట్టిన. ఈసారి స్కూళ్లు చాలు అయినప్పటి (జూన్ 12) నుంచి పిల్లలకు టిఫిన్ పెట్టవద్దు అని పెద్ద సార్లు చెప్పిన్రు. అప్పటి నుంచి మధ్యాహ్న భోజనం మాత్రమే పెడుతున్నం. కాంగ్రెస్ ప్రభుత్వం మా ఇబ్బందులను గుర్తించి పాత బిల్లులు ఇవ్వాలి. అలాగే మా జీతాలు, మధ్యాహ్న భోజన బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నయ్. వాటిని కూడా వెంటనే విడుదల చేసి మమ్మల్ని ఆదుకోవాలి.

**- డీ.లలిత, అల్పాహారం నిర్వాహకురాలు, మంజులాపూర్.**

### పిల్లలకు ఏ కొదవరాకుండా చూసుకుంటున్నం..



ఉట్నూర్ రూరల్, జూలై 9 : మూడు నెలల నుంచి మధ్యాహ్న భోజన బిల్లులు రావడం లేదు. అప్పు తెచ్చి వండి పెడుతున్న. మాకు ఏమి మిగలడం లేదు. మార్కెట్‌లో సరుకుల ధరలు భగ్గుమంటున్నాయి. అయినా పిల్లలకు ఏ కొదవ రాకుండా చూసుకుంటున్నం. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులు సక్రమంగా చెల్లిస్తే బాగుంటుంది.

**- పుర్క బాగుబాయి, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు, లక్కారం.**



కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

### అంగన్‌వాడీల భిక్షాటన

ఎదులాపురం, జూలై 9 : రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఆందోళన కొనసాగిస్తున్నారు. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. మంగళవారం భిక్షాటన చేపట్టి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు దోనిపెల్లి వెంకటమ్మ మాట్లాడుతూ.. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.లక్ష పెంచాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 10ని రద్దు చేయాలని కోరారు. ఈ ఆందోళన కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.




నిర్మల్ కలెక్టర్ ఎదుట నిరసన తెలుపుతున్న బీడీ కార్మికులు

### బీడీ కార్మికుల నిరసన

నిర్మల్ అర్బన్, జూలై 9 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిర్మల్ కలెక్టరేట్ ఎదుట బీడీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రాజన్న మాట్లాడుతూ.. బీడీ పరిశ్రమలో పని చేస్తున్న ప్యాకర్స్, నెలసరి ఉద్యోగులు, బీడీ కార్మికులకు రేవంత్‌రెడ్డి సర్కారు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బక్కన్న, గంగన్న, లక్ష్మి, గంగామణి, విజయలక్ష్మి, కమల, పోశెట్టి, రాజేందర్, ఎల్లయ్య, ఫిరోజ్, వెంకటేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలి

**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి**

నిర్మల్ చైన్‌గేట్/ఎదులాపురం, జూలై 9 : అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో వనమహోత్సవం, మహిళాశక్తి, అమ్మ ఆదర్శ పాఠశాలలు, ధరణి, సీజనల్ వ్యాధులు, ప్రజాపాలన, సేవా కేంద్రాలు, ఉద్యోగుల బదిలీలపై సమీక్షించారు. వేర్వేరుగా జరిగిన వీడియో కాన్ఫరెన్సుల్లో జిల్లా అధికారులు పాల్గొన్నారు. నిర్మల్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్ కుమార్, అటవీ శాఖ అధికారి ప్రసాద్, డీఆర్వో భుజంగరావు, నిర్మల్, భైంసా ఆర్డీవోలు రత్నకల్యాణి, కోమల్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, జడ్పీ సీఈవో గోవింద్, డీఎంహెచ్‌వో ధన్‌రాజ్, డీఈవో రవిందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆదిలాబాద్ వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, జడ్పీ సీఈవో రత్నమాల, డీఆర్‌డీఏ సాయన్న, వ్యవసాయ అధికారి పుల్లయ్య పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నిర్మల్ కలెక్టర్, అధికారులు



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి



వీసీకి హాజరైన ఆదిలాబాద్ కలెక్టర్, ఐటీడీఏ పీవో, అదనపు కలెక్టర్లు

### ప్రాజెక్టుల పరిశీలన

జైనథ్, జూలై 9 : సాత్నాల ప్రాజెక్టు, చనాక-కొరట పంప్ హౌస్, బ్యారేజ్, పెన్‌గంగ వంతెనలను మంగళవారం కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. ఈ సందర్భంగా వరద సంసిద్ధత పరిశీలనలో భాగంగా కలెక్టర్ నీటి పారుదల శాఖ అధికారులను వరద మట్టం, పనులు పురోగతి, భూ సేకరణ వివరాలను తెలుసుకున్నారు. యేటా జిల్లాలో నమోదయ్యే అధిక వర్షపాతం కారణంగా వరద నిర్వహణ పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా ఉండాలని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం గతేడాది అధిక వరద ప్రవాహం వల్ల నిలిచిన రాకపోకలను అంతర్రాష్ట్ర బ్రిడ్జి, వాటర్ కమిషన్ ఆధ్వర్యంలోని నీటి ప్రవాహం కొలత గేజ్‌ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు ఎస్ఈ పి.రాము, విఠల్, తులసీరాం, డీఈఈ పెన్‌గంగ మనోహర్, సాత్నాల డీఈఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.



సాత్నాల ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా